

‘గృహజ్యోతి’
జీరో బిల్లుల జారీ
- బిల్లులు రాని వారు ఆందోళన చెందొద్దు
- మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారుల సూచన

8 లో..



ప్రమాదంలో మృతి చెందిన వలస కార్మికులు

బైక్‌ను ఢీకొట్టిన లారీ

- ఇద్దరు వలస కార్మికులు అక్కడికక్కడే మృతి
- మరొకరికి తీవ్రగాయాలు, ఆస్పత్రికి తరలింపు

తొగుట, మార్చి 1: తొగుట మండలం తుక్కాపూర్ గ్రామ శివారులో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వలస కార్మికులు అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. తుక్కాపూర్ గ్రామ శివారులో మల్లన్నసాగర్ రిజర్వాయర్ అదనపు టీఎంసీ కాలువ పనులను కేఎస్ఆర్ కంపెనీ చేపడుతోంది. ఈ కంపెనీలో పని చేయడానికి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మేన్‌పూరి జిల్లా కర్తువా గ్రామానికి చెందిన కార్మికులను నెలరోజుల క్రితం కాంట్రాక్టర్ తీసుకువచ్చాడు. నెలరోజులుగా కార్మికులు ఇక్కడే పనిచేస్తున్నారు. శుక్రవారం ఉదయం విద్యాసాగర్, అజయ్‌కుమార్, సచిన్‌కుమార్‌లు ద్విచక్రవాహనం(టీఎస్36 బీ 1624)పై తుక్కాపూర్ నుంచి తొగుటకు బయలుదేరారు. ఈ క్రమంలో తొగుట నుంచి సిద్దిపేటకు వెళ్తున్న లారీ(టీఎస్ 22 టీ 2299) అతివేగంగా వచ్చి.. తొగుట గ్రామ శివారులోని మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న మోటర్ సైకిల్‌ను ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న విద్యాసాగర్ (22), అజయ్‌కుమార్ (22) అక్కడికక్కడే మృతిచెందగా, సచిన్‌కుమార్ (19)కు తీవ్రగాయాలయ్యాయి. తీవంగా గాయపడిన సచిన్‌ను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ వర్థేశ్వర్‌సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడు విద్యాసాగర్ తమ్ముడు పంకజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తొగుట ఎస్ఐ లింగం వెల్లడించారు.

సైబర్ నేరాలను అరికట్టాలి


- సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, మార్చి 1 : సైబర్ నేరాల నియంత్రణలో కీలక పాత్ర వహించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ సైబర్ వారియర్స్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆమె సైబర్ వారియర్స్ సిబ్బందికి సైబర్ నేరాల నివారణపై కమిషనర్ కార్యాలయంలో ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాల నియంత్రణ, అమౌంట్ ఫ్రీజ్, బాధితులకు అప్పగించడంలో సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఈ మేరకు సైబర్ వారియర్స్‌ను సీపీ అభినందించారు. నూతన టెక్నాలజీని వినియోగించుకుంటూ సైబర్ నేరాలను అరికట్టాలని ఆమె సూచించారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. అలాగే ఫ్రీజ్ అయిన అమౌంట్ సంబంధిత బాధితులకు అందేలా బ్యాంకు అధికారులతో కీలకంగా వ్యవహరించాలన్నారు. బాధితులకు డబ్బు అందిన తర్వాత వారితో మెగా లోక్‌అదాలత్‌లో కేసులు డిస్పోజల్ చేయించాలని సూచించారు. ఇక సైబర్ నేరాలపై అవగాహన కల్పించడంతో పాటు సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో వాటిని అరికట్టడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని చెప్పారు. హెల్ప్‌లైన్ నంబర్ 1930కు సమాచారం అందించడం వల్ల బాధితులకు సత్వరమే అందే న్యాయంపై స్టేషన్ల అధికారులు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో సైబర్ సెల్ పోలీస్ స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ శేఖర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి, శ్రీధర్, ఎస్‌బీ ఎస్ఐ నరేందర్ రెడ్డి, సైబర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, సైబర్ వారియర్స్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లో
అసమ్మతి రాగం



- చైర్మన్ అవినీతి పరుడంటున్న కౌన్సిలర్లు
- నిరూపిస్తే రాజీనామా చేస్తానంటున్న చైర్మన్
- ఇప్పటికే అవిశ్వాస తీర్మానం ఇచ్చిన కౌన్సిలర్లు
- ఇటీవల కోరం లేకుండానే బడ్జెట్‌కు ఆమోదం
- పట్టించుకోని బీఆర్ఎస్ అధిష్ఠానం!!

గజ్వేల్, మార్చి 1: గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పాలకవర్గంలో అయోమయ పరిస్థితి నెలకొన్నది. మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు ఉప్పు నిప్పుగా ఉంటున్నారు. చైర్మన్ అవినీతి పరుడని కౌన్సిలర్లు ఆరోపణలు చేస్తుంటే, అవినీతిని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని మున్సిపల్ చైర్మన్ చెబుతున్నారు. రెండేళ్ల క్రితం మొదలైన అసమ్మతి ఇంకా చల్లారడం లేదు. గతంలో మాజీ మంత్రి అందరిని కూర్చోబెట్టి సఖ్యత కుదిర్చే ప్రయత్నం చేసినా పెద్దగా ఫలితాన్ని ఇవ్వలేదు. ఆ వెంటనే 14 మంది కౌన్సిలర్లు కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానాన్ని అందజేసి క్యాంపునకు వెళ్లారు. అనంతరం కోర్టు స్టే ఇవ్వడంతో తిరిగి వచ్చేశారు. అప్పటి నుంచి పట్టిపట్టనట్లుగా ఉన్న చైర్మన్, కౌన్సిలర్ల మధ్య ఇటీవల కాలంలో నిర్వహించిన బడ్జెట్ సమావేశాలు మరోసారి చిచ్చు రాజేశాయి. బడ్జెట్ సమావేశాలకు జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌ను మున్సిపల్ చైర్మన్ రాజమౌళి ఆహ్వానించారు. అయితే, కౌన్సిలర్లు డుమ్మా కొట్టారు. జిల్లా అధికార యంత్రాంగానికి తమ నిరసనను తెలియజేసేందుకు 14 మంది కౌన్సిలర్లు సమావేశాన్ని బహిష్కరించారు. ఈ సందర్భంగా మరోసారి అసమ్మతి భగ్గుమంది. ఈ క్రమంలో గతంలో ఇచ్చిన అవిశ్వాస తీర్మాణంపై తేదీని ప్రకటించాలని మరోసారి అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌కు బడ్జెట్ సమావేశాలను బహిష్కరించిన రోజే వినతిపత్రాన్ని అందజేసి, బలపరీక్షకు తేదీని ప్రకటించాలని కోరారు. ఈ నేపథ్యంలో తర్వాతి రోజే కోరం లేకుండా మునిసిపల్ చట్టం ప్రకారం బడ్జెట్‌ను ఆమోదించడంతో విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఈ క్రమంలో కౌన్సిలర్లు, చైర్మన్ మధ్య పెరిగిన అగాధాన్ని తగ్గించాల్సిన బీఆర్ఎస్ అధిష్ఠానం పెద్దగా ఈ అంశాన్ని పట్టించుకోవడం లేదు. వాస్తవానికి మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ 13 స్థానాలను గెలుచుకుని చైర్మన్‌స్థానాన్ని దక్కించుకున్నది. తర్వాత కాంగ్రెస్ నుంచి ఒకరు, ఆరుగురు స్వతంత్రులు బీఆర్ఎస్‌లో చేరారు. అందులో ఇప్పుడు 14 మంది అసమ్మతి రాగం వినిపిస్తున్నారు.

చైర్మన్, కౌన్సిలర్ల మధ్య అగాధాన్ని పెంచిన సీసీ రోడ్లు

2021-22 ఆర్థిక సంవత్సరంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి రూ.27 కోట్ల సీసీ రోడ్ల పనులను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మంజూరు చేశారు. ఈ పనులను మున్సిపల్ చైర్మన్ తనకు అనుకూలంగా ఉన్న కౌన్సిలర్లకు ఒకలా, అనుకూలంగా లేని కౌన్సిలర్లకు మరో రకంగా ఇచ్చారని ఆరోపిస్తూ పలువురు కౌన్సిలర్లు తమ నిరసనను తెలియజేశారు. ఈ విషయాన్ని అప్పట్లో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ క్రమంలోనే అప్పటి మంత్రి హరీశ్‌రావు అందరిని కూర్చోబెట్టి మాట్లాడినా వారి మధ్య సఖ్యత కుదరలేదు. నాడు మొదలైన అసమ్మతి రోజురోజుకూ పెరుగుతూ వచ్చింది.



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ

తాజాగా మరోసారి అవినీతి ఆరోపణలు

తాజాగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్‌పై కౌన్సిలర్లు అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. కానీ, ఎక్కడా బహిరంగంగా అవినీతికి సంబంధించిన అంశాలను ప్రస్తావించకపోగా 2021లో హరితహారంలో భాగంగా మంజూరైన ట్రీ గార్డులకు చెల్లించిన రూ.22లక్షల విషయంలో అవినీతి జరిగిందని ఆరోపిస్తున్నారు. అనధికారికంగా లేఅవుట్ల యజమానుల వద్ద వసూళ్లకు పాల్పడ్డారని, పలు భవనాల అనుమతుల విషయంలోనూ అవినీతి జరిగిందని ఆరోపణలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చైర్మన్ సైతం ధీటుగా బదులిస్తున్నారు. తాను ఎక్కడా అవినీతికి పాల్పడలేదని, టీఎస్ ఆగ్రోస్ సంస్థకు ట్రీ గార్డులకు సంబంధించిన చెల్లింపులు చేశామని, ప్రభుత్వ సంస్థకు చెల్లింపులు చేస్తే ఎలా అవినీతి జరుగుతుందని ఆయన ప్రశ్నిస్తున్నారు. కౌన్సిలర్ల మనసులో ఏదో పెట్టుకుని పైకి ఏదో చేస్తున్నారని చైర్మన్ వాపోతున్నారు. అవినీతి నిరూపిస్తే రాజీనామా చేసేందుకు సిద్ధమని చైర్మన్ అంటున్నారు.

బలపరీక్షకు తేదీని ప్రకటించని అధికారులు

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో చైర్మన్‌పై గతేడాది ఫిబ్రవరిలో మునిసిపల్ కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం ఇప్పటివరకు జిల్లా అధికారులు స్పందించలేదు. బల పరీక్షకు తేదీలను ప్రకటించాలని ఇటీవల కాలంలో అసమ్మతి కౌన్సిలర్లు వినతిపత్రాన్ని అందించినా జిల్లా యంత్రాంగం పెద్దగా స్పందించలేదు. ఈ నేపథ్యంలో ఒకరిద్దరు కౌన్సిలర్లు పార్టీ మారైనా సరే చైర్మన్‌ను దింపాలని ఉబలాటపడుతున్నట్లు తెలుస్తున్నది. మునిసిపాలిటీలో ఇంత జరుగుతున్నా అటు బీఆర్ఎస్ అధినాయకత్వం, ఇటు బీఆర్ఎస్ నాయకులు పెద్దగా పట్టించుకోవడం లేదు. త్వరలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎవరి వైపు నిలిచినా తమకు నష్టం కలుగుతుందని భావిస్తున్న అధిష్ఠానం ఈ విషయమై పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు అవగతమవుతున్నది. ఏదేమైనా సమష్టిగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అభివృద్ధిపై నిర్ణయం తీసుకోవాల్సిన పాలకవర్గ సభ్యులు ఇలా విడిపోయి ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా వ్యవహరిస్తుండడంతో మున్సిపల్ అభివృద్ధి కుంటుపడుతుంది. ఈ మునిసిపల్ పాలకవర్గం హయాంలో చేసిన అభివృద్ధి, పని ఏముందని పలువురు కౌన్సిలర్లే ప్రశ్నించుకుంటున్నారు. భవిష్యత్తులో ఏం చేశారని ప్రజలు ప్రశ్నిస్తే చెప్పడానికి కూడా సమాధానం లేదని బాహటంగానే వాపోతున్నారు.

బీజేపీ నుంచి కాంగ్రెస్ వైపు
భారీ వలసలు!

- మల్కాజ్‌గిరి వైపు ఈటల దృష్టి సారించడంతో నాయకుల కినుక
- వారం, పదిరోజుల్లో చేరికకు రంగం సిద్ధం!!

గజ్వేల్, మార్చి 1 : భారతీయ జనతా పార్టీ నాయకులు ఆ పార్టీకి ఝలక్ ఇవ్వనున్నారు.! ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి అధికార బీఆర్ఎస్‌పై అసంతృప్తితో ఉన్న సీనియర్ నాయకులు మాజీ మంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. అనంతరం ఆయనను గెలిపించేందుకు శాయశక్తులా శ్రమించారు. అయినప్పటికీ ఫలితం దక్కలేదు. అయితే, ఈటల రాజేందర్ మల్కాజ్‌గిరి పార్లమెంట్‌పై దృష్టిసారించడంతో ఆయనను నమ్ముకుని పార్టీలో చేరిన నాయకులను పట్టించుకోవడం లేదని తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు. తాము అధికార పార్టీని కాదని ఆయన గెలుపు కోసం కష్టపడితే ఎన్నికలు అయ్యాక పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత అధికార పార్టీ నాయకులకు టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తున్నది. ఈ మేరకు సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి వారితో పలు దఫాలుగా మాట్లాడినట్లు సమాచారం. వర్గల్, ములుగు, తూప్రాన్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు జగదేవ్‌పూర్, వర్గల్ మండలాలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. ముఖ్యంగా మున్సిపాలిటీ చెందిన నాయకులు వచ్చే మున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా పార్టీ మారే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు బీజేపీలో అసంతృప్తిగా ఉన్న ఓ మాజీ కౌన్సిలర్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. తామంతా కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని, త్వరలోనే గజ్వేల్ నియోజకవర్గంలో భారీ మార్పులు ఉంటాయని తెలిపారు.

గౌరవెల్లి రిజర్వాయర్‌ను
త్వరగా పూర్తి చేయండి

- నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరిన మంత్రి పొన్నం

హుస్నాబాద్, మార్చి 1 : హుస్నాబాద్ నియోజకవర్గంలోని గౌరవెల్లి రిజర్వాయర్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరినట్లు రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిసి ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని కోరారు. అలాగే రాజీవ్ రహదారి పరిధిలో ఉన్న కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు రోడ్డు వైండింగ్ పూర్తి చేయాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సమస్యలపై వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు



మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్



సీఎస్ శాంతికుమారి శుక్రవారం హైదరాబాద్ నుంచి డీజీపీ, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధ, అధికారులు

హైవే.. నో వే!

- పనులకు మోక్షం లభించేనా?
- ప్రభుత్వం ప్రతిపాదించిన రోడ్లలో కొత్తపల్లి టూ జనగామ ప్రస్తావనే లేదు
- మంత్రి ఆదేశాలతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్న అధికారులు
- రోడ్డు పూర్తయితే విజయవాడకు తగ్గనున్న దూరాభారం
- వేములవాడ, యాదాద్రికి సులువుకానున్న ప్రయాణం
- రెండు హైవేలతో రవాణా పరంగా హుస్నాబాద్ అభివృద్ధి

హుస్నాబాద్, మార్చి 1: కరీంనగర్ రాజీవ్‌రహదారి (కొత్తపల్లి) నుంచి హుస్నాబాద్ మీదుగా జనగామ హైవే పనులకు మోక్షం లభించడం లేదు. గత ప్రభుత్వ హయాంలో హుస్నాబాద్‌లో పర్యటించిన అప్పటి ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ఈ హైవే నిర్మాణానికి హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదు. కేంద్ర ప్రభుత్వం భారత్ మాల 3 ఫేజ్‌లో భాగంగా జాతీయ రహదారి నిర్మాణానికి ప్రతిపాదించింది. కేంద్రం నేషనల్ హైవే, రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ హైవే నిర్మాణం చేపట్టేలా నిధులు మంజూరు చేస్తామని చెప్పినా అవి కూడా నీటిమూటలుగానే మిగిలాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని పార్టీలు ఈ హైవే పనులను ప్రాధాన్యంగా తీసుకుని ప్రచారం చేశాయి. అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన స్టేట్ హైవేల్లో ఈ రోడ్డు ప్రస్తావన రాలేదు. ఈ క్రమంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రభాకర్ ఈ పనులకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. త్వరగా ప్రణాళికలు సిద్ధం చేసి పనులకు శ్రీకారం చుట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ రహదారి నిర్మాణం పూర్తయితే రవాణా పరంగా అనేక ప్రయోజనాలు కలగనున్నాయి. అంతర్రాష్ట్ర రవాణాతో పాటు తెలంగాణలోని మూడు జిల్లాలకు రాకపోకలు సులువుకానున్నాయి. కరీంనగర్, సిద్దిపేట, జనగామ జిల్లాలలను ఈ రహదారి కలుపుతుంది. కరీంనగర్ నుంచి హుస్నాబాద్ మీదుగా జనగామ, సూర్యాపేట, విజయవాడతో పాటు వేములవాడ, ధర్మపురి, బాసర, యాదాద్రి పుణ్యక్షేత్రాలకు దూరాభారం తగ్గుతుంది. ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల ప్రజలు యాదాద్రి వెళ్లేందుకు సిద్దిపేట, చేర్యాల, జనగామ మీదుగా యాదాద్రికి వెళ్తున్నారు. లేదంటే కరీంనగర్, హుజూరాబాద్, హన్మకొండ, జనగామ మీదుగా యాదాద్రికి చేరుకుంటున్నారు. హుస్నాబాద్ మీదుగా ఈ హైవే నిర్మాణం జరిగితే దాదాపు 30 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ప్రస్తుతం కరీంనగర్ నుంచి కొత్తపల్లి వరకు రాజీవ్ రహదారి ఉంది. ఇక కొత్తపల్లి నుంచి జనగామ వరకు 74 కిలోమీటర్ల మేర హైవే నిర్మాణం చేయాల్సి ఉంటుంది.

హుస్నాబాద్ అభివృద్ధికి బాటలు

ఇప్పటికే హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఎల్కతుర్తి నుంచి హుస్నాబాద్ మీదుగా సిద్దిపేట, రామాయంపేట వరకు జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి.



జనగామ వెళ్లే రోడ్డు

కొత్తపల్లి నుంచి జనగామ వరకు హైవే నిర్మాణం జరిగితే రెండు రహదారులతో హుస్నాబాద్ పట్టణం రవాణా, వ్యాపార పరంగా ఎంతో అభివృద్ధి చెందుతుంది. ప్రస్తుతం కరీంనగర్ నుంచి హుస్నాబాద్ మీదుగా సూర్యాపేట, విజయవాడకు వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. దీని నిర్మాణం జరిగితే మరింత రవాణా సౌకర్యం బలపడుతుంది.

రెండు ఫేజ్‌లుగా ప్రణాళికలు సిద్ధం

రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఈ హైవే నిర్మాణానికి రెండు ఫేజ్‌లుగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 74 కిలోమీటర్ల మేర హైవే నిర్మాణంలో కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ ఒక ఫేజ్, హుస్నాబాద్ నుంచి జనగామ వరకు రెండవ ఫేజ్‌గా ప్రణాళికలు తయారు చేశారు. నేడో రేపో ఈ ప్రతిపాదనలను మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అందించనున్నట్లు సమాచారం. దాదాపు రూ.400 కోట్ల అంచనా వేయగా ప్రధానంగా హుస్నాబాద్ నుంచి జనగామ వరకు ఎక్కువగా మలుపులు ఉండటంతో రోడ్డు నిర్మాణానికి భూసేకరణ అవసరమవుతుందని గుర్తించారు. అలాగే మిషన్ భగీరథ పైపులు, విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్‌కు నిధులు ఎక్కువగా వెచ్చించాల్సి రావొచ్చు.



హుస్నాబాద్ నుంచి జనగామ రోడ్డు

‘అనివేటి’ మండప నిర్మాణం పూర్తయ్యేనా?

- సమీపిస్తున్న రేణుకా ఎల్లమ్మ జాతర
- శంకుస్థాపన చేసి ఏడాది
- నేటికీ మొదలు కాని పనులు
- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని భక్తుల వేడుకోలు

హుస్నాబాద్ టౌన్, మార్చి 1 : హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ జాతరకు సమయం దగ్గర పడుతున్నది. ఏటా మే 23 నుంచి నెలరోజులు పాటు ఈ జాతర సాగుతుంది. అయితే, ఇంకా ఆలయ అవినేటి మండప నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. ఆలయంలో గతంలో ఉన్న మండపాన్ని కూల్చేశారు. కొత్త మండప నిర్మాణానికి రూ.50లక్షలు మంజూరు చేశారు. నిర్మాణ పనులకు ఏడాది క్రితం అప్పటి ఎమ్మెల్యే వొడితెల సతీష్ శంకుస్థాపన చేశారు. ఇప్పటికి నేటికీ పనులు ప్రారంభానికి నోచుకోకపోవడం గమనార్హం.

ప్రతి సంవత్సరం వైశాఖ పౌర్ణమి నుంచి జేష్ఠ పౌర్ణమి వరకు నెలరోజుల పాటు ఎల్లమ్మ జాతర సాగుతుంది. ఈ జాతరకు హుస్నాబాద్ చుట్టుప్రక్కల గ్రామాల నుంచే కాకుండా మహారాష్ట్రలోని చంద్రాపూర్, షోలాపూర్, బీదర్, హైదరాబాద్, నిజామాబాద్, జనగామ, మెదక్, సంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, జగిత్యాల,పెద్దపల్లి, భువనగిరి జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు హాజరై మొక్కులు తీర్చుకుంటారు. ఏటా భక్తుల సంఖ్య అంతకంతకు పెరుగుతున్నది. ఈ క్రమంలో జాతర ప్రారంభానికి ముందే సర్వం సిద్ధం చేస్తే భక్తులకు ఇబ్బందులు ఉండవు. కానీ, పనులు ఇంకా ప్రారంభించకపోవడంతో జాతర సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా మండపస్థానంలో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఆలయ పునరుద్ధరణ

ఆలయాన్ని గొప్పగా పునరుద్ధరించాలనే ఉద్దేశంతోనే అనివేటి మండప నిర్మాణ పనులు నిలిపినట్లు ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ఆలయాన్ని ఆధునీకీకరించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించారని తెలిపారు. దాదాపు రూ. 4 నుంచి 5 కోట్లు వెచ్చించి హైదరాబాద్ జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయం మాదిరిగా తీర్చిదిద్దాలని యోచిస్తున్నట్లు స్పష్టం చేశారు. దీని కోసం మాస్టర్ ప్లాన్ తీసుకుంటున్నామని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.



రేణుకా ఎల్లమ్మ ఆలయం

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్, మార్చి 1: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో అసిస్టెంట్ ఎలక్ట్రీషన్ కోర్సులో 90 రోజుల ఉచిత శిక్షణకు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఖేడ్ శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి నగేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు జిల్లాలోని మున్సిపల్ ప్రాంతాలకు చెందినవారై, 10 తరగతితో పాటు ఆపై తరగతుల ఉత్తీర్ణత సాధించిన 18నుంచి 33ఏళ్ల వయస్సు లోపు ఉన్న నిరుద్యోగులు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫాం, షూ, హెల్మెట్, స్టేషనరీ ఇవ్వనున్నట్టు తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందించడంతోపాటు ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. ఆసక్తి గలవారు. అవసరమైన ధ్రువ పత్రాల జిరాక్స్ ప్రతులతో దరఖాస్తులను ఈ నెల 4న సాయంత్రం వరకు సంగారెడ్డిలోని ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. మిగతా వివరాలకు 7780791531కు సంప్రదించాలన్నారు.

ఎరువుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలి



అగ్రో సేవా కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ విజయనిర్మల

చిన్నశంకరంపేట, మార్చి 1: రైతులు కొనుగోలు చేసిన ఎరువుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందు పరచాలని ఏడీఏ విజయనిర్మల ఫర్టిలైజర్, సీడ్ షాపు డీలర్లకు సూచించారు. శుక్రవారం చిన్నశంకరంపేట, జంగరాయి, చందంపేట సొసైటీలను ఆమె సందర్శించారు. సొసైటీ సీఈవోలతో ఎరువు బస్తాల నిలువపై సమీక్షించారు. అనంతరం చిన్నశంకరంపేట ఆగ్రోస్ సేవా కేంద్రం, గవ్వపల్లి ఎక్స్ రోడ్డు రామలింగేశ్వర ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఆయా షాపుల్లో నిలువ ఉన్న యూరియా బస్తాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు పిచికారి మందులు కొనుగోలు చేసినప్పుడు రసీదుతో పాటు రైతు వివరాలను ఆన్‌లైన్లో పొందుపరుచాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియాను స్టాక్ ఉంచకుండా తగిన మోతాదులోనే యూరియా బస్తాలను షాపులలో స్టాక్ ఉంచాలని డీలర్లకు సూచించారు. ప్రతీ షాపులో గుర్తింపు పొందిన పిచికారి మందులను విక్రయించాలన్నారు. రైతులు తప్పనిసరి వ్యవసాయాధికారుల సలహాలు పాటించి మందులను స్ప్రే చేయాలని సూచించారు. ఆమె వెంట ఏవో లక్ష్మీప్రవీణ్, ఏఈవోలు ఉన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ ప్రకటించడం హర్షణీయం



చిన్నశంకరంపేటలో హర్షం వ్యక్తం చేస్తున్న ఎస్టీయూ నాయకులు

చిన్నశంకరంపేట, మార్చి 1: ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న డీఎస్సీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ... వచ్చే జూన్ నుంచి నూతన ఉపాధ్యాయులు వచ్చే వరకు పాఠశాలల్లో విద్యా వలంటీర్లను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. జీవో ఎంఎస్ నెంబర్ 31 కమిటీ వేయడం హర్షించదగ్గ విషయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులను అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా కన్వీనర్ శివరాజయ్య, వెల్దుర్తి మండల ప్రధాన కార్యదర్శి కిరణ్, రామాయంపేట మండలాధ్యక్షుడు శ్రీనివాస్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీవో

హవేళిఘణపూర్, ఫిబ్రవరి 1: మండలంలోని వాడి పాఠశాలను ఎంపీడీవో హరిశ్వర్ గౌడ్ శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని వసతులు, హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి, విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించాలన్నారు. తరగతిలోని విద్యార్థులకు ప్రశ్నలు వేసి వారి సామర్థ్యాలను తెలుసుకొన్నారు. ఉపాధ్యాయుల పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీవో రాజ్ కుమార్, ఉపాధ్యాయులు సుభాష్ రెడ్డి, తదితరులున్నారు.

స్వీప్ ద్వారా అవగాహన

● సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి



కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సంగారెడ్డి రూరల్, మార్చి 1: స్వీప్ కార్యక్రమాల ద్వారా ఓటింగ్ పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చిరునామా మారిన ఓటర్ల వివరాలు, డూప్లికేట్ ఓటర్ల వివరాలు, మరణించిన ఓటర్ల జాబితాను తన దృష్టికి తీసుకురావాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. ప్రత్యేకంగా పరిశీలించి విచారణ జరిపిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సదుపాయాలు, వృద్ధులు, దివ్యాంగులకు ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ పెళ్లిళ్ల సీజన్‌లో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నందున వివాహ కార్యక్రమాలకు షాపింగ్‌కు ప్రజలు తమ వెంట నగదు తీసుకువెళ్తారని, అందువల్ల చెక్‌పోస్టుల వద్ద తనిఖీల్లో పట్టుబడిన నగదును వారికి వెంటనే అందించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌ను కోరారు. అందుకు ఆమె స్పందిస్తూ ఎన్నికల కోడ్ తరువాత చెక్‌పోస్టుల్లో పట్టుబడిన నగదుకు సరైన పత్రాలు చూపించి నగదును పొందవచ్చని వివరించారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా సబ్‌స్టేషన్ మరమ్మతులు

● మరో నాలుగు రోజుల్లో వినియోగంలోకి.. ప్రస్తుతం రెండు పీటీఆర్‌లతోనే అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

సిద్దిపేటరూరల్, మార్చి 1: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో 100ఎంవీఏ పీటీఆర్ బిగింపు పనులు చకచకా కొనసాగుతున్నాయి. ట్రాన్స్‌కో ఉద్యోగులు, కార్మికులు మొత్తం 50మంది రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు. వికారాబాద్ జిల్లా కేతిరెడ్డిపల్లి సబ్‌స్టేషన్‌లో అదనంగా ఉన్న పీటీఆర్ (పవర్ ట్రాన్స్‌ఫార్మర్)ను తీసుకొచ్చి సిద్దిపేటలో బిగిస్తున్నారు. ఫిబ్రవరి 21న రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో బేస్‌మెంట్‌తో సహా ధ్వంసమైన పరికరాలన్నింటినీ తొలగించి నూతన పరికరాలను ఏర్పాటు చేస్తున్నారు. 6ఫీట్ల బేస్‌మెంట్ నూతనంగా నిర్మించారు. పీటీఆర్‌ను మాత్రమే కేతిరెడ్డిపల్లి నుంచి తెచ్చారు.



సిద్దిపేట సబ్‌స్టేషన్‌లో పీటీఆర్ నిర్మాణ పనుల్లో నిమగ్నమైన ఉద్యోగులు, కార్మికులు

సిబ్బంది అప్రమత్తంతో అంతరాయానికి చెక్

సిద్దిపేట సబ్ స్టేషన్‌లోని మూడు పీటీఆర్‌లతో సిద్దిపేట, దుబ్బాక, సిద్దిపేట రూరల్ సబ్ డివిజన్‌లకు విద్యుత్ సరఫరా కొనసాగుతుంది. అందులో ఒకటి ప్రమాదానికి గురైనప్పటికీ మిగతా రెండింటితో ఈ ప్రాంతాలలోని రైతులకు, పరిశ్రమలకు, విద్యుత్ వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. రెండు పీటీఆర్‌లతో విద్యుత్ సరఫరా చేయడం కారణంగా ఓవర్‌లోడ్ అయినప్పటికీ ఉద్యోగులు అప్రమత్తంగా ఉంటూ చిన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. పీటీఆర్ ప్రమాదం వల్ల రోజుల తరబడి విద్యుత్ అంతరాయం కలుగుతుందన్న వినియోగదారుల భయాన్ని తొలగిస్తూ నిరంతర అందిస్తామనే భరోసాను విద్యుత్‌శాఖ కల్పిస్తుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. రెండు రోజుల్లో బిగింపు పనులు పూర్తవుతాయని, మరో రెండు రోజుల్లో ట్రయల్ రన్ చేస్తూ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్‌ను ఫిల్టర్ చేయాల్సి ఉంటుంది. దాంతో మార్చి 6వ తేదీ నుంచి వినియోగంలోకి తేనున్నట్లు సమాచారం.

వెంటాడుతున్న కోతల భయం

వేసవికాలం కావడంతో విద్యుత్ ఉత్పత్తి తగ్గి విద్యుత్ కోతలు ఉంటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దానికి తోడు సిద్దిపేట సబ్ స్టేషన్‌లో పీటీఆర్ ప్రమాదానికి గురవడం మరింత ఆందోళన కలిగిస్తున్నదని రైతులంటున్నారు. పంటలకు ఈ సమయంలోనే నీటి శాతం అధికంగా అవసరముంటుందని, విద్యుత్ కోతల సమస్య తలెత్తితే భారీగా పంట నష్టం జరిగే అవకాశం ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీలైనంత త్వరగా పీటీఆర్‌ను బిగించి వినియోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

ఆందోళన అవసరం లేదు



మూడు పీటీఆర్‌ల ద్వారా విద్యుత్ సరఫరా అందించాల్సి ఉంటుంది. అందులో ఒకటి అంతర్గత సమస్యతో పేలిపోయింది. రెండు పీటీఆర్‌లతో సరఫరాలో అంతరాయం కలుగుతుందని రైతులు భయాందోళన చెందాల్సిన అవసరం లేదు. మరో నాలుగు రోజుల్లో పీటీఆర్ బిగింపు పనులు కూడా పూర్తవుతాయి. వేసవికాలం కాబట్టి విద్యుత్ అంతరాయం ఉంటుందనే రైతుల అపోహలకు అవకాశం లేదు. పరిశ్రమలకు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ట్రాన్స్‌కో ఉద్యోగులు నిరంతరం కృషి చేస్తున్నారు. ప్రస్తుతం బిగిస్తున్న 100ఎంవీఏ పీటీఆర్‌తో మరింత మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తాం.

\- శ్రీనివాసులు, ట్రాన్స్‌కో డీఈ, సిద్దిపేట

డాక్టర్లు సమయపాలన పాటించాలి

● జీజీహెచ్‌ను సందర్శించిన డీఎంఈ వాణి



డీఎంఈ డాక్టర్ వాణికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ అనీల్, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధామాధురి

సంగారెడ్డి అర్బన్, మార్చి 1: సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని మెడికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జి డైరెక్టర్(డీఎంఈ) డా.ఎన్.వాణి సందర్శించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన డా.వాణిని ఇటీవల ప్రభుత్వం డీఎంఈగా నియమించిన విషయం తెలిసిందే. శుక్రవారం ఆమె డీఎంఈ హోదాలో సంగారెడ్డి జీజీహెచ్‌ను సందర్శించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ చాంబర్‌లో ఆమె డాక్టర్లు విధులకు హాజరవుతున్న సమయాన్ని పరిశీలించారు. 10.30 గంటల వరకూ డాక్టర్లు విధులకు హాజరుకాకపోవడం పట్ల ఆమె పలువురు డాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించకుంటే ఎలా.. ఓపీ ద్వారా వచ్చే రోగులకు ఏ విధంగా వైద్య సేవలందిస్తారంటూ ప్రశ్నించారు. విధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ, సమయపాలన పాటిస్తూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలని ఆమె సూచించారు. కాగా డీఎంఈ హోదాలో డా.వాణి తొలిసారి జీజీహెచ్‌కు రావడంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.అనీల్‌కుమార్, మెడికల్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.సుధామాధురి, ఆర్ఎంవోలు డా.వీరాంజనేయులు, డా.రవికుమార్ తదితరులు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆరోగ్య సమాజానికి పునాది వేద్దాం

● అసిస్టెంట్ డైరెక్టర్, వరంగల్ జోనల్ మలేరియా అధికారి నాగయ్య



సింగాటం గ్రామంలో ఫైలేరియా ఇంటింటి సర్వేను పర్యవేక్షిస్తున్న వరంగల్ జోనల్ మలేరియా అధికారి నాగయ్య

గజ్వేల్, మార్చి 1: దోమలను అరికట్టి ఆరోగ్య సమాజానికి పునాది వేద్దామని అసిస్టెంట్ డైరెక్టర్, జోనల్ మలేరియా అధికారి ఈ.నాగయ్య పిలుపునిచ్చారు. గజ్వేల్ మండలం సింగాటం గ్రామంలో గురువారం రాత్రి ఇంటింటికీ తిరిగి ప్రీటాస్ మైక్రో ఫైలేరియా సీజనల్ సర్వేలో భాగంగా ఫైలేరియా బ్లడ్ శాంపిళ్లను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫైలేరియా రోగకారక క్రిములు వ్యాప్తి చెందుతున్నాయా అని సర్వే నిర్వహించామన్నారు. మురికి కాల్వలను శుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల నివారణకై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. దోమల వల్ల అనేక రకాల వ్యాధులు సంక్రమిస్తాయని, ఫైలేరియా, మలేరియా, డెంగ్యూ, చికెన్‌గునియా లాంటి వ్యాధులు సంక్రమిస్తాయని, మన ఇంటిని శుభ్రంగా ఉంచుకున్నట్టే పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఆరుగురు పారామెడికల్ సిబ్బందితో సుమారు 300మందికి బ్లడ్ స్మియర్స్ తీసి ప్రీ టాస్ మైక్రో ఫైలేరియా సర్వే నిర్వహించామని తెలిపారు. వారితో ఎంపీహెచ్ఈవో ఎ.రమేష్, ఫైలేరియా సూపర్‌వైజర్ చిన్న కొండయ్య, గజ్వేల్ సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్, డి.నాగరాజు, ల్యాబ్ టెక్నీషియన్లు కోటేశ్వరరావు, బాలరాజేశం, ఫరీద్‌ఖాన్, అప్మాదీపూర్ సూపర్‌వైజర్ శోభారాణి, ఆశా వర్కర్లు వజ్రమ్మ, నాగమణి, అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

గల్లీలో లేదు.. ఢిల్లీలో లేదు

బీఆర్ఎస్ ఒక్క సీటూ గెలిచేది లేదు

● విజయ సంకల్పయాత్రలో బీజేపీ నేత, మాజీ ఎంపీ బూరనర్సయ్య గౌడ్

చేర్యాల, మార్చి 1: పదేళ్లపాలనలో తెలంగాణ విధ్వంసానికి పాల్పడిన బీఆర్ఎస్ ప్రస్తుతం గల్లీలో, ఢిల్లీలో ఎక్కడా లేదని, వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అసలు గెలిచేదీ లేదని బీజేపీ నేత, భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ పేర్కొన్నారు. బీజేపీ విజయ సంకల్పయాత్రలో భాగంగా కొమురవెల్లి మండలకేంద్రం నుంచి జనగామ జిల్లాకేంద్రం వరకు చేపట్టిన బైక్ ర్యాలీని శుక్రవారం కొమురవెల్లిలో ప్రారంభించిన అనంతరం చేర్యాలలోని అంగడిబజారులో రోడ్ షోలో ప్రసంగించారు. బీఆర్ఎస్‌ను నమ్ముకుంటే రూ.7 లక్షలకోట్లు అప్పుల పాలయ్యామన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు దేశప్రజలు సురక్షితంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో సాధ్యం కాని హామీలనిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌తో ప్రజలకు ఒరిగేదేమీలేదన్నారు. కాంగ్రెస్‌తో కరెంటు కష్టాలు నెలకొని పొలాలు, బోర్లు ఎండిపోతున్నాయన్నారు. వరి పొలాలను పశువులు మేస్తున్నాయని, రైతుబంధు రాలేదని ఎద్దేవా చేశారు. కేంద్రీయ విద్యాలయాలు, పాస్‌పోర్టు కేంద్రం, ఎయిమ్స్, జాతీయ రహదారులు వంటి వసతుల కల్పనతో భువనగిరి పార్లమెంట్ నియోజకర్గ పరిధిలో రూ.లక్ష కోట్ల సంపద పెంపొందిందన్నారు. తెలంగాణలో పండిన ప్రతీ గింజను కేంద్రం కొనుగోలు చేసి, రూ.9.36లక్షల కోట్లు నిధులు ఇచ్చిందన్నారు. బీజేపీతోనే కొమురవెల్లిలో రైల్వేస్టేషన్ సాకారమైందన్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి నియోజకవర్గానికి సాగునీరు ఇవ్వని బీఆర్ఎస్ చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయకుండా వివక్ష వహించిందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి పట్టంకట్టాలని కోరారు. అంతకుముందు కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షులు ఆరుట్ల దశమంతరెడ్డి, సిద్దిపేట అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ఉమా రాణి, నాయకులు కూరెల్ల రాజు, కేవీఎల్ఎన్‌రెడ్డి, బూరుగు సురేశ్, ఉమారాణి, దండ్యాల లక్ష్మారెడ్డి, మన్నె సత్యవర్ధన్, కుర్రారం బాలనర్సయ్య, వడ్లకొండ సంజీవులు తదితరులు పాల్గొన్నారు.



కొమురవెల్లిలో మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో

బీఆర్ఎస్ కొత్త నాటకం

● గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి



గజ్వేల్, మార్చి 1: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు కొత్త నాటకానికి తెరలేపారని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి విమర్శించారు. గజ్వేల్ పట్టణంలోని ఆయన నివాసంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు చలో మేడిగడ్డ యాత్ర చేపట్టడం సిగ్గుచేటన్నారు. నాసిరకంగా నిర్మించి ప్రాజెక్టు వైఫల్యానికి కారణమైన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల కోసం కొత్త నాటకానికి తెరలేపడం విడ్డూరమన్నారు. బీఆర్ఎస్ నాయకులు తప్పు ఒప్పుకుని వెంటనే ప్రజలకు, రైతాంగానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నేషనల్ డ్యాం సేఫ్టీ అధికారులు మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం సరిగా లేదని తేల్చారని, అయినప్పటికీ సిగ్గు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఎన్ని జిమ్మిక్కులు చేసినా వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఒక్క సీటూ రాదన్నారు. మెదక్ పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఉగాండాలో నార్సింగ్ వాసి ఆత్మహత్య

● స్వస్థలానికి మృతదేహం తరలింపు

చేగుంట, మార్చి 1: సౌత్ ఆఫ్రికా ఉగాండా దేశంలో మెదక్ జిల్లా నార్సింగ్ మండల కేంద్రానికి చెందిన ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నార్సింగి మండల కేంద్రానికి చెందిన తమ్మారెడ్డి గారి లక్ష్మారెడ్డి కుమారుడు తమ్మారెడ్డి కరుణాకర్ రెడ్డి(40) రెండేళ్ల క్రితం ఉపాధి కోసం సౌత్ ఆఫ్రికాలోని ఉగాండాకు చెందిన సూడాన్ ఎక్స్‌పోర్ట్ కంపెనీలో పని చేయడానికి వెళ్లాడు. ఫిబ్రవరి 26న కరుణాకర్‌రెడ్డి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు అక్కడి కరుణాకర్ మిత్రులు నార్సింగ్‌లోని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని స్వస్థలం రప్పించడానికి తెలంగాణ వలస కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి. సాయేందర్‌ను సంప్రదించగా, ఉగాండా నుంచి మృతదేహాన్ని తెప్పించడంతో పాటు శంషాబాద్ విమానాశ్రయం నుంచి స్వగ్రామం వరకు ప్రభుత్వం తరఫున ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వం వలస వెళ్లి చనిపోయిన వారి అంత్యక్రియలకు, కుటుంబ సభ్యులకు ఆర్థికంగా ఆదుకోవాలని సాయేందర్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. మృతుడికి భార్య లావణ్య కొడుకు భానుప్రసాద్ రెడ్డి(10), కూతురు భానుప్రియ (12) ఉన్నారు.

చిప్పల్‌తుర్తి శివారులో వ్యక్తి హత్య




దుర్గేష్(ఫైల్)

నర్సాపూర్, మార్చి 1: మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తి శివారులో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చిప్పల్‌తుర్తి సమీపంలో నిర్మానుష్య ప్రాంతంలో ఓ మృతదేహం పడిఉందని స్థానికుల సమాచారం మేరకు సీఐతో పాటు పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించగా మృతదేహంపై బలమైన గాయాలున్నాయి. ఎవరో హత్య చేసి మృతదేహాన్ని ఇక్కడ పడేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లికి చెందిన దుర్గేష్(28) అని తేలింది. ఈ మేరకు కుటుంబీకులకు సమాచారమిచ్చి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు సీఐ తెలిపారు. మృతదేహాన్ని నర్సాపూర్ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

హత్యకేసులో పోలీసుల అదుపులో ముగ్గురు..

జిన్నారం, మార్చి 1: వ్యక్తి హత్య కేసులో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు బొల్లారం సీఐ నయీమొద్దీన్ తెలిపారు. గత నెల 27న మాదారం, కొడకంచి శివారులో హత్యకు గురైన నల్తూరు గ్రామానికి చెందిన శ్రీకాంత్(27) హత్య కేసులో నిందితులైన ముగ్గురిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. కాగా శ్రీకాంత్‌కు వాడక్‌పల్లి గ్రామానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధమే హత్యకు దారి తీసింది. కేసులో నిందితులైన గౌతమ్, విక్రమ్, రాములును అదుపులోకి తీసుకున్నారు.

బొలెరో వాహనం బోల్తాపడి డ్రైవర్ దుర్మరణం



పీర్ భాష మృతదేహం

రామాయంపేట, మార్చి 1: బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదం రామాయంపేట మండల పరిధి అక్కన్నపేట శివారులో శుక్రవారం చోటు చేసుకున్నది. ఎస్ఐ రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి ప్రాంతానికి చెందిన పీర్ భాష (60) ఈ ఉదయం గోధుమ పొట్టు లోడుతో పటాన్ చెరువు నుంచి కామారెడ్డికి బయలుదేరాడు. ఈ క్రమంలో నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతో ఒక్కసారిగా బొలెరో వాహనం పల్టీ కొట్టి రోడ్డు కిందకు దూసుకుపోయింది. దీంతో పీర్ భాష అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ సమాచారమందుకున్న ఎస్ఐ ఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. కేసు దర్యాప్తు జరుపుతున్న ఎస్ఐ తెలిపారు.

చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

చేగుంట, మార్చి 1: చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు జారి పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన నర్సింగ్ మండల పరిధిలోని శేరిపల్లిలో శుక్రవారం చోటు చేసుకున్నది. శేరిపల్లి గ్రామానికి చెందిన బండారు మల్లేష్ యాదవ్ (40) చింత పండు కొట్టడానికి కూలీకి వెళ్లాడు. చెట్టు పైకి ఎక్కి చింత కాయలు కొడుతూ ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. బంధువులు వెంటనే అతడిని నార్సింగ్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. బంధువుల ఫిర్యాదు మేరకు నార్సింగ్ ఎస్ఐ అహ్మద్ మోహియుద్దీన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రాంతీయ ఆసుపత్రికి తరలించినట్టు వెల్లడించారు.

అమ్మకు ప్రేమతో..

● ప్రతిమను తయారు చేయించి వివాహ వార్షికోత్సవం



నాగలక్ష్మి ప్రతిమతో సత్యనారాయణ, వారి కుటుంబ సభ్యులు

గుమ్మడిదల, మార్చి 1: అమ్మ గతేడాది కన్నుమూసింది. తన 50వ వివాహ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని ఆమె చిరకాలవాంఛ. అయితే ఆ కోరిక నెరవేరకముందే ఆమె కన్నుమూసింది. అమ్మ ప్రేమను ఎరిగిన ఆమె కుమారులు భౌతికంగా అమ్మ లేకపోయినా.. ప్రతిరూపాన్ని తయారు చేయించి తల్లిదండ్రుల 50వ వివాహ వార్షికోత్సవాన్ని అనుకున్నంత ఘనంగా నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలకు చెందిన చెన్నంశెట్టి సత్యనారాయణ భార్య నాగలక్ష్మి(64) గత ఏడాది చనిపోయారు. ఆమెకు 50 సంవత్సరాల వివాహ వేడుకను ఘనంగా జరుపుకోవాలని కోరికగా ఉండేది. చెన్నంశెట్టి సత్యనారాయణ, నాగలక్ష్మిల వివాహం జరిగి శుక్రవారానికి 50 సంవత్సరాలు పూర్తయింది. దీంతో వారి తనయులు చెన్నశెట్టి కోటేశ్వర్, సారథి, సూర్యనారాయణ, శ్రీనివాస్, చంటి, ఉదయ్‌లు తమ తల్లి ప్రతిమను తయారు చేయించి, గుమ్మడిదలలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బంధుమిత్రుల సమక్షంలో తల్లిదండ్రుల 50వ వివాహ వేడుకను ఘనంగా నిర్వహించి ఆమె చిరకాల వాంఛను ఈడేర్చారు.

చింతలచెర్వు పీహెచ్‌సీలో వైద్యాధికారుల విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



విచారణ జరుపుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

హత్నూర, మార్చి 1: 'చింతల్‌చెర్వు పీహెచ్‌సీలో ఇష్టారాజ్యం' శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ నాగ నిర్మల స్పందించారు. ఈ మేరకు చింతల్‌చెర్వు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, విచారణ చేపట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నేత్రపతి, సిబ్బందితో మాట్లాడి పలు విషయాలు తెలుసుకున్నారు. విచారణ నివేదికను జిల్లా వైద్యాధికారికి అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పూర్తిస్థాయి నివేదిక అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఇంటలిజెన్సీ అధికారులు సైతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి విచారణ చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు ఇవ్వనున్నట్లు వారు తెలిపారు.

నాసిరకం పనుల వల్లే దెబ్బతిన్న ప్రాజెక్టులు: ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్, మార్చి 2: గత బీఆర్ఎస్ ప్రభుత్వం నాసిరకంగా ప్రాజెక్టులు కట్టడం వల్లనే కొన్నాళ్లకే దెబ్బతిన్నాయని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీఅధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేసిన తప్పును ఒప్పుకోక దెబ్బతిన్న ప్రాజెక్టులను చూసిరావడానికి వెళ్లడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో అక్రమాలకు పాల్పడ్డ విషయమై సమగ్ర విచారణ చేయించి అందుకుబాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఛీ కొట్టి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తే బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా మాటలతో కాలయాపన చేసి ఇప్పుడు కల్లబొల్లి మాటలు చెబుతున్నారని ఆంజనేయులుగౌడ్ ఎద్దేవా చేశారు.

ఎంసీహెచ్‌లో లీపు రోజున 15 మంది జననం

●బర్త్‌డేకు మరో నాలుగేళ్లు ఆగాల్సిందే

సంగారెడ్డి అర్బన్, మార్చి 1: నాలుగేళ్లకోసారి వచ్చే లీపు సంవత్సరం ప్రత్యేకత అందరికీ తెలిసిందే. ప్రతి ఏటా ఫిబ్రవరిలో 28 రోజులుండగా, లీప్ ఇయర్‌లో ఫిబ్రవరిలో ఒక రోజు అధికంగా 29 రోజులు ఉంటాయి. ఆ రోజు పుట్టిన వారంతా తమ మొదటి బర్త్‌డే జరుపుకునేందుకు నాలుగేళ్ల వరకు ఆగాల్సిందే. ఇదిలా ఉండగా సంగారెడ్డిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఫిబ్రవరి 29వ తేదీన(గురువారం) 15 మంది జన్మించారు. ఈ లీపు వీరులు బర్త్‌డే కోసం మరో నాలుగేళ్లు వేచి చూడాల్సిందే నన్న మాట.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 12 మందికి జరిమానా

● ఒక్కరికి జైలు శిక్ష

సిద్దిపేట క్రైం, మార్చి 1: సిద్దిపేటపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల నిర్వహించిన వాహనతనిఖీల్లో 12 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడినట్టు సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. వారిని శుక్రవారం సిద్దిపేట అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి. శ్రావణి ఎదుట హాజరుపరచగా విచారణ అనంతరం 12 మందికి మొత్తం రూ.5 వేల జరిమానా విధించారు. వారిలో ఒక నిందితుడికి 2 రోజుల జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ రామకృష్ణ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసమే రోజూ డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించనున్నట్టు తెలిపారు.

పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

● ప్రారంభమైన ప్రీ-ఫైనల్ పరీక్షలు



కూచన్‌పల్లి జడ్పీహెచ్ఎస్‌లో ప్రీ-ఫైనల్ పరీక్షలు రాస్తున్న పదో తరగతి విద్యార్థులు

మెదక్ అర్బన్, మార్చి 1: ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. మెదక్ జిల్లాలో ఇప్పటికే సిలబస్ రివిజన్‌తోపాటు ప్రత్యేక క్లాసులు పూర్తి చేశారు. వార్షిక పరీక్షలపై విద్యార్థులు పట్టు సాధించేందుకు వీలుగా ప్రీ-ఫైనల్-1 పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం శుక్రవారం నుంచి మధ్యాహ్నం వేళల్లో జిల్లా వ్యాప్తంగా ప్రీ-ఫైనల్ పరీక్షలు ప్రారంభించారు. తొలి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 2న హిందీ, 4న ఇంగ్లీష్, 5న గణితం, 6న భౌతిక శాస్త్రం, 7న జీవశాస్త్రం, 11న సామాజిక శాస్త్ర పరీక్షలు జరుగనున్నాయి. ఈ నెల 18 నుంచి నిర్వహించనున్న వార్షిక పరీక్షలకు విద్యార్థులను అన్ని విధాలా సన్నద్ధం చేస్తున్నట్లు విద్యాధికారులు తెలిపారు. వార్షిక పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 68 కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో 10,300 మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

హవేళిఘణపూర్, ఫిబ్రవరి 1: మండల పరిధిలోని శమ్నాపూర్ శివారులోని రాజరాజేశ్వరి ఆలయంలో శుక్రవారం మెదక్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలుడికి, రామాయంపేట మండలానికి చెందిన బాలికకు పెళ్లి చేస్తున్నారన్న సమాచారంతో పోలీసులు అక్కడికి వెళ్లి అడ్డుకున్నారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలికను మెదక్ సఖి కేంద్రానికి తరలించారు. బాలుడినికుటుంబ సభ్యులతో పంపించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ రాజు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలను ఎవరైనా ప్రోత్సహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిన్న వయస్సులో వివాహాలు జరిగితే ఆరోగ్య పరమైన సమస్యలు తలెత్తుతాయని వివరించారు. ఆయనవెంట పోలీసులు బేతయ్య, నర్సింహులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ఝరాసంగం, మార్చి 1: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ప్రభుత్వాస్పత్రి వైద్యురాలు రమ్య, ఉపాధ్యాయుడు రాంచందర్ భీంవంశీ పేర్కొన్నారు. శుక్రవారం ఝరాసంగంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వతరగతి విద్యార్థులు స్థానిక ప్రభుత్వాస్పత్రి ప్రాంతంలో పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంపొందించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి వైద్యురాలు రమ్య, ఉపాధ్యాయుడు రాంచందర్‌భీంవంశీ మాట్లాడుతూ.. ఇళ్లల్లో తడి, పొడి చెత్త బుట్టలను వేర్వేరుగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. చెత్తను వీధుల్లో ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్తబుట్టలను ఏర్పాటు చేసుకుని అందులో వేయాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీవైద్యాధికారి సుదర్శన్ పాల్గొన్నారు.



పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అప్పుల బాధతో ముగ్గురి బలవన్మరణం

ఉమ్మడి మెదక్ జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో శుక్రవారం ముగ్గురు వ్యక్తులు బలవన్మరణం చెందారు. మృతులందరూ అప్పుల బాధతోనే ఆత్మహత్యకు పాల్పడడం గమనార్హం.



కుమార్ (ఫైల్)

రాయపోల్, మార్చి 1: అప్పుల బాధతో మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం ఉప్పరపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యులు, ఎస్ఐ శ్రీరాం ప్రేమ్‌దీప్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఉప్పరపల్లి గ్రామానికి చెందిన చెంగర్ల కుమార్ (44) ఏడాది క్రితం రూ. 3లక్షల అప్పు చేసి కూతురి పెళ్లి చేశాడు. అప్పు తీరేమార్గం కనిపించకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురై మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. మద్యం ఎందుకు తాగావని భార్య మందలించడంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. వెతికినా ఫలితం లేకపోయింది. శుక్రవారం ఉదయం జంగపల్లి రోడ్డు వద్ద గల ఓ చెట్టుకు ఉరేసుకొని మృతి చెందాడని గమనించిన గ్రామస్థులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య చెంగర్ల జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



చింత కుమార్ (ఫైల్)

● **తొగుట:** అప్పుల బాధ భరించలేక చింత కుమార్(39) అనే వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం తొగుటలో చోటుచేసుకున్నది. పోలీసులు, గ్రామస్థుల వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన కుమార్ అప్పులు చేసి వరికోత మిషన్, డీసీఎం వాహనం కొనుగోలు చేశాడు. వాటి కోసం చేసిన అప్పులు తడిసి మోపెడయ్యాయి. ఉన్న ఇంటి స్థలాన్ని, వాహనాలను అమ్మినా అప్పులు తీరలేదు. దీంతో అప్పుల వారి వేధింపులు, కుటుంబ పోషణ భారంగా మారింది. తీవ్ర మనస్థాపానికి గురైన కుమార్ శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి భార్య కవిత, కొడుకు అభిలాష్, కూతురు అక్షయ ఉన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు పోలీసులు తెలిపారు.

వేర్వేరు చోట్ల ఘటనలు



సురేష్ మృతదేహం

● **చేగుంట:** అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నార్సింగ్ మండల కేంద్రం లోని ఎస్సీ కాలనీలో శుక్రవారం జరిగింది. నార్సింగ్ ఎస్ఐ అహ్మద్ మోహియుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగ్ ఎస్సీ కాలనీకు చెందిన చీగులపల్లి సురేష్ (39) కూలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధ భరించలేక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. కుటుంబ జీవితం పై విరక్తి చెంది ఇంటిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ తెలిపారు.

గృహజ్యోతి జీరో బిల్లుల జారీ

గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులు సూచించారు. శుక్రవారం రోజు ఆ పథకం అమలులో భాగంగా, ఆయా గ్రామాల్లో 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగంచిన వారికి జీరో బిల్లులను వారు అందజేశారు. జీరో బిల్లులు రాని వారు ఆందోళన చెందవద్దని, అలాంటి వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇప్పటికే రెండు గ్యారెంటీలను అమలు చేసిందని, మరో రెండు గ్యారెంటీలకు శ్రీకారం చుట్టిందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

గజ్వేల్, మార్చి 1:గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో విద్యుత్ మీటర్ రీడింగ్ తీయించి గృహజ్యోతి జీరో బిల్లును గజ్వేల్ విద్యుత్‌శాఖ డీఈ భానుప్రకాశ్ వినియోగదారులకు అందజేశారు. ఆయనతో ఏఈలు గంధం మారుతి, సత్యనారాయణ, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

● **మద్దూరు:** విద్యుత్ ఏఈలు సుధీర్‌బాబు, శ్రీనివాస్‌రావు సిబ్బందితో కలిసి గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ, 200 యూనిట్ల లోపు వారికి జీరో బిల్లులు అందించారు. కార్యక్రమంలో లైన్‌మెన్ పి. శ్రీనివాస్, జేఎల్ఎంలు పి. రాజయ్య, సిద్దేశ్వర్‌రెడ్డి, వి. శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. దూళిమిట్ట మండలం జాలపల్లి గ్రామంలో గృహజ్యోతి పథకాన్ని ఎంపీటీసీ చెట్కూరి కల్యాణీ కమలాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నేటి నుంచి ఉచిత విద్యుత్‌తో పాటు రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకం అమలవుతుందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ శ్రీనివాస్‌రావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మద్దూరులో వినియోగదారురాలికి జీరో బిల్లు అందిస్తున్న విద్యుత్ ఏఈ



జగదేవ్‌పూర్ మండలం తిగుల్‌లో జీరో బిల్లును అందజేస్తున్న దృశ్యం

● **నారాయణరావుపేట:** నారాయణరావుపేట మండల కేంద్రంలో విద్యుత్ మీటర్ రీడింగ్ తీసి, గృహజ్యోతి జీరో బిల్లును లబ్ధిదారులకు విద్యుత్ శాఖ ఏఈ తిరుపతి అందజేశారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్లు శ్రావణ్ కుమార్, వలియుద్దీన్, లైన్‌మెన్‌లు పర్శరాములు, బాలకృష్ణ, జేఎల్ఎంలు తదితరుల పాల్గొన్నారు.

● **దుబ్బాక/మిరుదొడ్డి:** దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల ఏఈలు శ్రీకాంత్, రామాంజనేయులు శుక్రవారం మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ, జీరో విద్యుత్తు బిల్లులను అందజేశారు.

● **కొండపాక:** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సీఎం రేవంత్ రెడ్డి అమలు చేసి తీరుతారని కుకునూరుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విరుపాక శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం కుకునూరుపల్లిలో గృహలక్ష్మి పథకం అమలు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవీందర్, నరసింహాచారి తదితరులున్నారు.

● **జగదేవ్‌పూర్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో నాలుగు గ్యారెంటీలను అమలు చేసిందని, గృహజ్యోతిలో భాగంగా 200 యూనిట్లు ఫ్రీగా ఇవ్వడం ఎంతో సంతోషదాయకమని తిగుల్ తాజా మాజీ సర్పంచ్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు కప్పర భానుప్రకాశ్‌రావు అన్నారు.



కుకునూరుపల్లిలో గృహలక్ష్మి కరెంట్ బిల్లును చూపిస్తున్న కాంగ్రెస్ నాయకులు



గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లో జీరో బిల్లును వినియోగదారుడికి అందజేస్తున్న డీఈ భానుప్రకాశ్

కలెక్టర్‌ను కలిసిన మునిసిపల్ కమిషనర్

గజ్వేల్, మార్చి 1: సిద్దిపేట జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మిక్కిలినేని మనూ చౌదరిని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. సిద్దిపేటలోని కలెక్టర్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా మునిసిపాలిటీకి సంబంధించిన పన్నుల వసూళ్లు, అభివృద్ధి కార్యక్రమాలపై కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు.



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న మునిసిపల్ కమిషనర్ నరసయ్య

'విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగలను శిక్షించాలి'



తహసీల్ కార్యాలయాధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

చేర్యాల, మార్చి 1 : సిద్దిపేట మండలం బక్రిచెప్యాల గ్రామంలో జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాన్ని ధ్వంసంచేసిన దుండగులను శిక్షించాలని కోరుతూ, శుక్రవారం ఆర్యవైశ్య మహాసభ నాయకులు కొమురవెల్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి తడక లింగమూర్తి మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం ప్రసాదించిన మహనీయుడి ని అవమానపరిచిన వారిని వెంటనే గుర్తించాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మాంకాల నగేశ్, పట్టణాధ్యక్షుడు మాంకాల శంకరలింగం, కోశాధికారి రావికంటి సత్యనారాయణ, ప్రతినిధులు మాంకాల ప్రసాద్, మంకాల రవి, కాపర్తి మల్లికార్జున్ పాల్గొన్నారు.

జిల్లాలో యూరియా కొరత లేదు

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్

కొండపాక, మార్చి 1: జిల్లాలో ఎక్కడా కూడా యూరియా కొరత లేదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ పేర్కొన్నారు. కొండపాక మండలం రాంపల్లి గ్రామంలో వరి పొలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు యాసంగి వరి సాగు చేసేటప్పుడు పాటించాల్సిన పద్ధతులను వివరించారు. యాసంగి వరి సాగులో సరైన పద్ధతులను పాటించాలని వివరించారు. విత్తనం ఎంచుకునే ముందు చౌడును, సల్ఫేడ్ దుష్ప్రభావం, మోగి పురుగుని తట్టుకునే పరిశోధన రకాలైన జెజిఎల్ 24423 ఎంచుకోవాలన్నారు. నారు దశలో కార్బొఫ్యూరాన్ 3జి గుళికలు లేదా కార్టప్ హైడ్రోక్లోరిక్ 4జి గుళికలు వేయాలన్నారు. నాటు వేసే ముందు నారు కొసలను తుంచి నాటుకోడం వల్ల మోగి పురుగు గుడ్ల నుంచి రక్షణ లభిస్తుందన్నారు. అలాగే పంట పొలలో ఎకరానికి 8 లింగాకర్షక బుట్టలు పెట్టడం ద్వారా మోగి పురుగు నియంత్రించవచ్చున్నారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ మండల అధికారి ప్రియదర్శిని, ఏఈవోలు ఉన్నారు.



రాంపల్లిలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారులు

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● జడ్పీచైర్‌పర్సన్ రోజారాధాకృష్ణ శర్మ

సిద్దిపేట అగ్రికల్చర్, మార్చి 01: పొద్దు తిరుగుడు సాగు చేసిన రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీచైర్‌పర్సన్ రోజారాధాకృష్ణ శర్మ సూచించారు. శుక్రవారం సిద్దిపేట మార్కెట్ యార్డులో పొద్దు తిరుగుడు విత్తనాల కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సిద్దిపేట జిల్లాలో నీటి కొరత లేకుండా పోయిందని, రైతులు వరి పంట తర్వాత పొద్దుతిరుగుడు సాగు వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. కొనుగోలు కేంద్రాల్లో పొద్దుతిరుగుడు సాగు చేసిన రైతులు పంటను ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సెక్రటరీ వెంకటయ్య, మార్క్‌ఫెడ్ డీఎం క్రాంతి, మార్క్‌ఫెడ్ ఎంఈ లక్ష్మన్, హమాలీ కార్మికులు, రైతులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ్పీచైర్ పర్సన్ రోజారాధాకృష్ణ శర్మ

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● డీడబ్ల్యూవో సావిత్రి



బాలింతలకు, గర్భిణీలకు అవగాహన కల్పిస్తున్న డీడబ్ల్యూవో

చిన్నకోడూరు, మార్చి 1: మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి సావిత్రి అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని ఇబ్రహీంనగర్ అంగన్‌వాడీ కేంద్రం-3లో బాలింతలు, గర్భిణీలకు లింగ సమానత్వంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భస్థ శిశు నిర్ధారణ నిరోధక చట్టం, గృహహింస నిరోధక చట్టం, బాల్య వివాహల చట్టం, బాల్య వివాహాలతో ఎదురయ్యే సమస్యలను గురించి వివరించారు. మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారిత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ వాసవి, ఇన్‌చార్జి సీడీపీవో రమాదేవి, మాజీ సర్పంచ్ సుభాష్, సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్‌లు, బాలింతలు, గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.

లీప్ రోజున 15 మంది జననం

సంగారెడ్డి అర్బన్, మార్చి 1: నాలుగేళ్లకోసారి వచ్చే లీప్ సంవత్సరానికి ప్రత్యేకత ఉంటుంది. సాధారణంగా ప్రతి ఏడాది ఫిబ్రవరి నెలలో 28 రోజులుంటాయి. కానీ లీప్ ఏడాది ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి. ఇలా ఉండగా సంగారెడ్డిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో లీపు దినోత్సవం రోజున గురువారం 15 మంది జన్మించారు. వీరు తమ మొదటి పుట్టిన రోజు జరుపుకోవాలంటే మరో నాలుగేళ్లు ఆగాల్సిందే.

మాజీ ఎమ్మెల్యేకు నివాళి

పాపన్నపేట, మార్చి 1: మెదక్ మాజీ ఎమ్మెల్యే, దివంగత నారాయణరెడ్డి వర్ధంతిని శుక్రవారం ఆయన స్వగ్రామమైన యూసుఫ్‌పేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సమాధి వద్ద కుటుంబ సభ్యులు, కుమారుడు, మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డితో పాటు నాయకులు యేసురెడ్డి, ఏడుపాయల మాజీ చైర్మన్ నర్సింహులు, మాజీ డైరెక్టర్ వెంకోబా, మధుసూదన్ రెడ్డి, బుజంగరెడ్డి, వెంకట్‌రామ్‌రెడ్డి పాల్గొని నివాళులర్పించారు.

కొత్తపల్లి సొసైటీ మాజీ చైర్మన్ కన్నుమూత

పాపన్నపేట: కొత్తపల్లి సొసైటీ మాజీ చైర్మన్ గంగుల రుక్మారెడ్డి(74) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, ఏడు పాయల మాజీ చైర్మైన్ జీవన్ రెడ్డి, సంతాపం తెలిపారు.

మునిసిపల్ మాజీ చైర్మన్‌కు పరామర్శ

గజ్వేల్, మార్చి 1: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్‌ను గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పరామర్శించారు. గజ్వేల్ పట్టణంలోని ఆయన నివాసంలో కలిసి ఇటీవల అనారోగ్యానికి గురై బైపాస్ సర్జరీ చేయించుకున్న విషయంపై ఆరా తీశారు.

కార్యకర్తలకు కాంగ్రెస్‌లో సముచిత స్థానం



నియామకపత్రాలను అందజేస్తున్న నాయకులు

నారాయణరావుపేట,మార్చి 1: కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డా ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు చొప్పదండి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామంలో ఎస్సీసెల్, మైనార్టీ సెల్ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మెదక్ ఎంపీ స్థానం నుంచి కాంగ్రెస్ అత్యధిక మెజార్టీతో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బర్మా రాంచంద్రం, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌వీర్, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ లక్ష్మణ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బింగి యాదగిరి, నాయకులు ఆశోక్, భాస్కర్, దేవయ్య, బాలయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

'మోదీ సభకు జనసమీకరణ చేయాలి'

మనోహరాబాద్: ప్రధాని మోదీ సభకు మనోహరాబాద్ మండలం నుంచి పెద్ద ఎత్తున జన సమీకరణ చేయాలని మండల నాయకులకు బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ బండారు మహేష్ దిశానిర్దేశం చేశారు. మనోహరాబాద్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో బీజేపీ మండలాధ్యక్షుడు నరేంద్రచారి, నాయకులు నరేష్, మల్లేశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లేమి

● ఎల్. బంజర్‌పల్లిలో రూ.10 లక్షలు వృథా

● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

తొగుట, మార్చి 1: పట్టణాలకు దీటుగా మారుమూల పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ, కాంట్రాక్టర్ల అత్యాశ, అధికారుల బాధ్యతరాహిత్యం కారణంగా ప్రజాధనం వృథా అవుతున్నది. తొగుట మండలంలోని ఎల్. బంజర్‌పల్లి గ్రామానికి జాతీయ ఉపాధిహామీ ద్వారా రూ.10 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. సీసీ రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో వేసిన మూణ్నాళ్లకే కంకర తేలింది. 10 లక్షల సీసీ రోడ్డుకు ప్రభుత్వ నియమనిబంధనల ప్రకారం 800 బ్యాగుల సిమెంట్, 120 టన్నుల ఇసుక, 100 టన్నుల 20 ఎంఎం కంకరతో పాటు లిక్విడ్ మిక్స్ చేసి పనులు చేయాల్సి ఉంటుంది. కానీ గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్డు పనులలో కేవలం 350 నుంచి 400 వరకు సిమెంట్ బ్యాగులు, నాసిరకం ఇసుక వాడినట్లు సమాచారం. సీసీ పనులు జరిగేటప్పుడు పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు అటు వైపు వెళ్లకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారీతిన పనులు చేపట్టినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంబంధిత పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని మళ్లీ సీసీ రోడ్డు పనులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కంకర తేలిన సీసీ రోడ్డు

సీసీ రోడ్డు నిర్మాణ మళ్లీ చేపట్టాలి



సీసీ రోడ్డు గిట్లనే పోస్తర. అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. ఇంత అధ్వానంగా పనులను ఎప్పుడూ చూడలే. పనులు చేసిన కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇవ్వకుండా మళ్లీ సీసీ రోడ్డు పనులు చేపించాలి.

- రాచకొండ మంజుల, మాజీ సర్పంచ్

కాంగ్రెస్‌పై తపుడు ప్రచారాలు చేస్తే తరిమికొట్టాలి

● యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పూజల గోపీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న పూజల గోపీ కృష్ణ

సిద్దిపేట క్రైం, మార్చి 1 : బీఆర్ఎస్, బీజేపీ పార్టీల వారు కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన పథకాలపై తప్పుడు ప్రచారం చేస్తే, యూత్ కాంగ్రెస్ నేతలు తరిమికొట్టాలని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి, పార్లమెంట్ ఎన్నికల అసెంబ్లీ ఇన్‌చార్జి పూజల గోపి కృష్ణ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో సిద్దిపేట అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపి కృష్ణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన పథకాలను ఇంటింటికీ వివరిస్తూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసెంబ్లీ అధ్యక్షుడు వాహబ్, పట్టణ అధ్యక్షుడు గాయస్, అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ బబ్బు, ప్రధాన కార్యదర్శులు శివ, సాయి ప్రతాప్, నంగునూర్ సిద్దిపేట రూరల్, సిద్దిపేట అర్బన్, నారాయణరావుపేట్ మండల అధ్యక్షులు శ్రీకాంత్, అనిల్, కరుణాకర్, అజ్జు యాదవ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వెలికట్ట క్రాస్‌రోడ్ వద్ద ప్రయాణికుల ఇక్కట్లు

● మూత్రశాలలు, బస్సుషెల్టర్ లేక అవస్థలు



రోడ్డుపై వేచి చూస్తున్న ప్రయాణికులు

కొండపాక, మార్చి 1 : కొండపాక మండలం రాజీవ్ రహదారిపై ఉన్న వెలికట్ట క్రాస్‌రోడ్ వద్ద ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. సిద్దిపేట నుంచి హైదరాబాద్ వెళ్లే దారి దుద్దెడ టోల్‌ప్లాజా దాటిన తర్వాత ఉన్న ఈ క్రాస్ రోడ్డు వద్ద నిత్యం ఎన్నో వాహనాలు, వేలాది మంది ప్రయాణాలు సాగిస్తుంటారు. గతంలో ఈ ప్రాంతం సాదాసీదాగా ఉండేది. కానీ ప్రస్తుతం ఎంతో అభివృద్ధి చెందింది. దుద్దెడ పరిసర ప్రాంతాల ప్రజలతో పాటు అటు హైదరాబాద్ ఇటు సిద్దిపేటకు మరోవైపు చేర్యాల, జనగామలతో పాటు పరిసర ప్రాంతాలకు వెళ్లే వారికి ఇది కూడలిగా మారింది. అలాగే క్రాస్ రోడ్ సమీపాన ఫార్మసీ కళాశాల ఉంది. విద్యార్థులు రోడ్డుపైనే బస్సుల కోసం వేచి చూస్తూ ఉంటారు. ఇక్కడ కనీస వసతులు లేకపోవడంతో నానా ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రధానంగా మూత్రశాలలు లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గంటల తరబడి బస్సుల కోసం వేచి చూస్తున్నారు. బస్‌షెల్టర్లు లేకపోవడంతో రోడ్డుపై కూర్చుంటున్నారు. మూత్రశాలలతో పాటు మినీ బస్సు షెల్టర్‌ను ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఉత్తరప్రదేశ్ పోలీసులపై చర్యలు తీసుకోవాలి

● కాంగ్రెస్ నాయకులు



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పిస్తున్ననాయకులు

సిద్దిపేట క్రైం, మార్చి 1: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని సిలైబర గ్రామం రాంపూర్ జిల్లాలో దళిత విద్యార్థి ఒకరు డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ చిత్రపటంతో కూడిన బోర్డును పార్కులో ఏర్పాటు చేసేందుకు వెళ్తుండగా, అతన్ని కాల్చి చంపిన ఉత్తరప్రదేశ్ పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొమ్ము విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆల్ ఇండియా చైర్మన్ రాజేష్ లిలోథియ, తెలంగాణ స్టేట్ చైర్మన్ ప్రీతం ఆదేశాల మేరకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజుతో కలిసి సిద్దిపేట ఆర్డీవో కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మీసం మహేందర్, వడ్లకొండ రవీందర్, నరేష్ ,రాజు జయంత్, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నారాయణరావుపేట, మార్చి1: గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ధరణి పెండింగ్ దరఖాస్తుల సదస్సును నిర్వహించారు. మండలంలోని ఐదు రెవెన్యూ గ్రామాల పరిధిలో 281 ధరణి పెండింగ్ దరఖాస్తులు ఉండగా, ఇబ్రహీంపూర్ గ్రామంలో 13 దరఖాస్తులను రికార్డులు పరిశీలించి అక్కడికక్కడే పరిష్కరించామని తెలిపారు. కార్యాక్రమంలో ఆర్ఐ రామాఅఖిలేష్, సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.

ఉమ్మడి మద్దూరులో 177

మద్దూరు, మార్చి 1 : ఉమ్మడి మండలంలో ధరణి పెండింగ్ దరఖాస్తులు 177 ఉన్నాయని తహసీల్దారు అనంతరెడ్డి తెలిపారు. మద్దూరు మండలంలో 82, దూళిమిట్ట మండలంలో 95 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఎస్సీలకు అన్యాయం

● డీఎస్పీ మండల ఇన్‌చార్జి శాగ సుమన్

నారాయణరావుపేట,మార్చి 1: బీసీ కులానికి చెందిన కొంతమంది దాసరి వారికి ఎస్సీ ఉపకులమైన హోలీయ దాసరి ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం వల్ల మాల, మాదిగ కులాలకు అన్యాయం జరుగుతున్నదని దళిత శక్తి ప్రోగ్రాం మండల ఇన్‌చార్జ్ శాగ సుమన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ ఉపకులం పేరు మీద ఇచ్చిన సర్టిఫికెట్లను రద్దు చేసి విచారణ చేపట్టాలని శుక్రవారం నారాయణరావుపేట మండలం ఇబ్రహీంపూర్ ఎస్సీ కుల సంఘాల నాయకులు తహసీల్దార్ లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదర్శ గ్రామమైన ఇబ్రహీంపూర్‌లో గత పాలకుల అండదండలతో రాజకీయ లబ్ధి కోసం బీసీ దాసరి వారు ఎస్సీ ఉపకులం హోలీయ దాసరి కులం పేరుతో తప్పుడు ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నారని మండిపడ్డారు. ఆ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితంలేకుండా పోయిందని వాపోయారు. వెంటనే సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్సీ యూత్ అధ్యక్షుడు పెద్దల రాజు, నాయకులు ఆశోక్, శ్రీనివాస్, ఎస్సీ మాల, మాదిగ సంఘాల నాయకులు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కువినతిపత్రం సమర్పిస్తున్ననాయకులు

స్టాఫ్ నర్సులను విధుల్లోకి తీసుకోవాలి

సిద్దిపేట అర్బన్, మార్చి 1: సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సుమారు 100 మందికి పైగా స్టాఫ్ నర్సులను తొలగించారని, వారిని ఎటువంటి షరతులు లేకుండా విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్టాఫ్ నర్సులతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన నిర్వహించి, వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విషయాన్ని గతంలో ఎంతో మంది అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, ఆరోగ్య శాఖ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని తెలిపారు. కష్టకాలంలో విధులు నిర్వహించి, సేవలందించిన వారిని గుర్తించకుండా ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వల్ల రోడ్డున పడ్డ స్టాఫ్ నర్సులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవి స్టాఫ్ నర్సులు తార, గీతా, బాల్‌లక్ష్మి, అనిత, సౌందర్య, అరుణ, లావణ్య, రాజకుమార్, బాలు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న స్టాఫ్ నర్సులు

వర్గీకరణ సాధనే మాదిగ అమరవీరులకు నిజమైన నివాళి

● ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు మైస రాములు



గజ్వేల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

గజ్వేల్, మార్చి 1: వర్గీకరణ సాధనే మాదిగ అమరవీరులకు నిజమైన నివాళి అని మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పీ) రాష్ట్ర నాయకుడు మైస రాములు పేర్కొన్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాదిగ అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఎమ్మార్పీఎస్ గజ్వేల్ మండలాధ్యక్షుడు ఉబ్బని అంజనేయులు ఆధ్వర్యంలో అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ గజ్వేల్ నియోజకవర్గ కో-ఇన్‌చార్జి శ్రీహరి చింద, మర్కూక్ మండల ఇన్‌చార్జి మహేశ్, రవిమోచీ, సీనియర్ నాయకులు గద్దల సుధాకర్, పొట్ట కరుణాకర్, సురేందర్ మోచీ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

● **నంగునూర:** వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరవీరుల త్యాగాలు వృథా పోవని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి దేవులపల్లి రాజేందర్ మాదిగ అన్నారు. శుక్రవారం నంగునూరులో మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు ఎనగందుల యాదగిరి, రాజమౌళి ఎమ్మార్పీఎస్ జిల్లా సంయుక్త కార్యదర్శి ఆరేపల్లి కనకయ్య, కందికట్ల రాజు, శంకర్, గ్రామ శాఖ అధ్యక్షుడు దేవులపల్లి నాగరాజు, సీనియర్ నాయకులు కనకయ్య, దేవులపల్లి బాలరాజ్ పాల్గొన్నారు.

మద్దూరు: దూళిమిట్ట మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ నాయకుడు సుందరగిరి భాస్కర్ మాట్లాడారు. కార్యక్రమంలో రాములు, వెంకటయ్య, వేణు, చంద్రయ్య, మహేందర్, బాలరాజు పాల్గొన్నారు.

విద్యార్థుల మాక్ పోలింగ్

జోగిపేట, మార్చి 1: అందోలులోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం మాక్ పోలింగ్‌ను నిర్వహించారు. ఎలక్షన్ కమిషనర్, జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు విద్యార్థులకు ఎన్నికల విధానంపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించేందుకు మాక్ పోలింగ్ నిర్వహించారు. పాఠశాలలోని 6నుంచి 10వతరగతి వరకు విద్యార్థులు మాక్ పోలింగ్‌లో పాల్గొన్నారు. విద్యార్థులే పోటీదారులుగా, ఎన్నికల సిబ్బందిగా, పోలీసులుగా, పోలింగ్ ఏజెంట్లుగా విధులు నిర్వహించారు. ఓటర్లుగా ఆధార్ కార్డు చూపించి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వి.దేవిదాస్, ఉపాధ్యాయులు ఎన్ విబి గీతా కుమారి, కె.రమేశ్, ఎ.మాణయ్య, అబ్దుల్ అజీమ్, సరిత, కొండల్, నవీన, వి.బి శ్రీనివాస్,వి.సాయిలు, శ్రీదేవి పాల్గొన్నారు

నర్మెట్టలో విద్యార్థుల స్వయం పరిపాలన



స్వయంపాలనలో విద్యార్థులు

నంగునూరు, మార్చి 1: నంగునూరు మండలం నర్మెట్ట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని శుక్రవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులై తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యాక్రమంలో పాధ్యాయులు బి.సీతారాములు, కే.శ్రీనివాస్, జి.శ్రీకాంత్ ,సిహెచ్.పద్మ, పి.శారద పాల్గొన్నారు.